





దాహమేస్తోంది

- విజయవాడ జీజీహెచ్‌లో తాగునీటి అవస్థలు
- కుళాయిలు కూడా లేక ఉప్పునీరే గతి
- మధ్యాహ్న భోజనానికి కూడా అదే నీరు
- పట్టించుకోని అధికారులు
- దాహార్తితో అలమటిస్తున్న రోగులు

6లో

సజావుగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు 98.03 శాతం హాజరు

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. కృష్ణాలో **98.03** శాతం, ఎన్టీఆర్‌లో **97.64** శాతం హాజరు నమోదైంది.



పెడనలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయడానికి వరుస క్రమంలో వెళ్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మొవ్వలోని పరీక్షా కేంద్రానికి కలిసి వెళ్తున్న విద్యార్థినులు

6లో

కిక్కు మనకుండా..

జిల్లాలో దొంగచాటుగా బెల్టుషాపుల దందా

అధికశాతం బడ్డీకొట్లలో మద్యం విక్రయాలు

జిల్లాలో బెల్టుషాపుల దందా కొనసాగుతోంది. ఊరుకు నాలుగు చొప్పున బెల్టుషాపులు ఏర్పాటుచేసి మరీ మద్యాన్ని అదనపు రేటుకు విక్రయిస్తున్నారు. ఓ సీసా కొన్నవారికి గ్లాసు, వాటర్ ప్యాకెట్ ఉచితమంటూ ఆఫర్లు ఇస్తున్నారు. ఇలాంటి బెల్టుషాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీస్ విభాగాల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడపదడపా దాడులు చేస్తుంటే ఈ బాగోతాలు బయటపడుతున్నాయి.

- మద్యం దుకాణాల నుంచి బార్ అండ్ రెస్టారెంట్లకు సరుకు
- ప్రత్యేక కోడ్‌తో జోరుగా వ్యాపారం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్, పోలీస్ శాఖలు
- నెలవారీ మామూళ్లు వసూలు
- సారా తయారీపైనా కొరవడిన దృష్టి



కృత్తివెన్నులోని ఓ బెల్టుషాపు నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మద్యం దుకాణాల నుంచి బెల్టుషాపులకు మద్యం యథేచ్ఛగా తరలిపోతోంది. ఇందుకోసం దుకాణాల యజమానులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. జిల్లాలోని మద్యం డిస్ట్రిబ్యూటరీ పాయింట్ల నుంచి ఏ దుకాణానికి, ఏ కోడ్‌తో మద్యం సరఫరా చేస్తున్నారనే అంశాన్ని నమోదు చేసుకుంటున్నారు. మద్యం విక్రయించే సమయంలో తాము ఎంచుకున్న కోడ్‌తో ఏ, బీ, సీ, డీ అనే అక్షరాలు బాటిళ్లపై రాస్తున్నారు. వాటి ఆధారంగా బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్టుషాపులపై దాడులుచేసి మద్యం సీసాలను పట్టుకున్న సమయంలో ఆ కోడ్‌ను చూసి వదిలేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ మద్యం రూ.99 నుంచి రూ.150 వరకు ఉంటుంది. ఈ బాటిళ్లను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలి. కానీ, మద్యం దుకాణాల యజమానులు ఒక్కో బాటిల్‌కు రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు రూ.99 మద్యం బాటిల్‌ను రూ.150కు విక్రయిస్తున్నారు. ఆయా మద్యం దుకాణాలకు సంబంధించిన పరిధిని నిర్ణయించి బెల్టుషాపులకు మద్యం విక్రయిస్తుండటంతో పాటు ముందస్తుగా ఎక్సైజ్ అధికారులకు సమాచారం వస్తున్నా అటువైపు కన్నెత్తి చూడట్లేదు. దీంతో మద్యం దుకాణ యజమానుల నుంచి జిల్లాలోని బార్ అండ్

మిగతా 6లో..

ఆగని సారా తయారీ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సారా తయారీ జోరుగా సాగుతోంది. పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలం ఆర్పీపల్లి, పోసినవారిపాలెం గ్రామాల్లో సారా తయారుచేస్తున్నారు. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి, 510 లీటర్లకుపైగా బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కరగ్రహారంలో జోరుగా సారా జరుగుతోంది. వివిధ కారణాలతో అధికారులు ఆవైపునకు కన్నెత్తి చూడలేదు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మద్యం దుకాణాలు బంద్ చేయగా, కృత్తివెన్నులోని ఓ బెల్టుషాపులో మాత్రం 15 మద్యం సీసాలను పట్టుకున్నారు. పెడన మండలం బల్లిపర్రు, మచిలీపట్నం మండలం చిన్నాపురంలో దాడులు చేసి 87 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెడన పట్టణంలోని ఓ బెల్టుషాపులో 40కు పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పెడనలోని బ్రహ్మపురం, గాంధీనగర్, రామలక్ష్మీ కాలనీ, దక్షిణ తెలుగుపాలెం, తోటమూల తదితర ప్రాంతాల్లో బెల్టుషాపులు జోరుగా నడుస్తున్నాయి. అయినా ఆవైపునకు ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. మచిలీపట్నంలోని శారదానగర్, పోతేపల్లి, వైస్సార్ కాలనీ, ముస్తాఖాన్‌పేట, ఉల్లిపాలెం తదితర ప్రాంతాల్లో రాత్రీపగలు తేడా లేకుండా జోరుగా బెల్టుషాపులు నడుపుతున్నా అదుపుచేసే వారే కరువయ్యారు.

దుర్గగుడిలో కీలక ఫైళ్ల గల్లంతు

గత ఈవోల నిర్లక్ష్యం కారణంగానే..

- ఈ-వ్యవస్థ పాటించకపోవడం వల్లే..
- ఉద్యోగులను వివరణ అడిగిన ఈవో



ఇంద్రకీలాద్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దేవస్థానంలో కీలకమైన పలు ఫైళ్లు గల్లంతైనట్లు సమాచారం. గతంలో పనిచేసిన ఈవోల నిర్లక్ష్యం కారణంగా, ఈ-ఆఫీసు వ్యవస్థను పాటించకపోవటం వల్లే ఇలా జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. గల్లంతైన ఫైళ్ల వ్యవహారంపై ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. కొన్నిరోజులుగా ఈవో ఫైళ్లను పరిశీలించే క్రమంలో ఈ విషయం బయటపడింది. దీంతో ఆయన ఆరా తీశారు. కోర్టుకు వెళ్లిన ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన కేసులు, ఇతర కేసులకు కోర్టులో కౌంటర్ వేయటానికి ఈ ఫైళ్లు అవసరం. ప్రస్తుతం ఇవి కనిపించకపోవటంతో ఈవో సంబంధిత విభాగ అధికారులు, ఉద్యోగులను పిలిచి అడిగారు. వారు సరైన సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. కనిపించకుండా పోయిన ఫైళ్ల గురించి గతంలో పనిచేసిన ఉద్యోగులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు సమాధానం చెప్పాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతానికి హెడ్డాఫీసు నుంచి ఫైళ్లను తెప్పించి కోర్టులో కౌంటర్ వేయటానికి చర్యలు తీసుకుంటున్నారు. సుమారు కీలకమైన 8 ఫైళ్లు గల్లంతైనట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు

- జాపూడి వద్ద జాతీయ రహదారిపై ఘటన
- కళాశాలకు వెళ్తూ కానరాని లోకాలకు..



కారు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన స్కూటీ (ఇన్‌సెట్‌లో) మృతురాలు తాజ్ అఫ్సా (ఫైల్)

ఇబ్రహీంపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం జూపూడి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్జూ మెహవిష్ (21) ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే శనివారం కూడా బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించడంతో మిగతా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ చంద్రశేఖర్ సందర్శించి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసిబిడ్డలపై పైసాచికం

ఉత్తరాది శిశువుల విక్రయం వెనుక అనేక కోణాలు

ఆ శిశువులు ఎవరు? వారి తల్లిదండ్రులు ఎవరు? ఉత్తరాదిలో ఏ ప్రాంతానికి చెందినవారు? బెజవాడలో శిశువులను విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసిన తర్వాత పోలీసులకు పుట్టుకొస్తున్న ప్రశ్నలివి. పక్కా సమాచారంతో విజయవాడ పోలీసులు మహిళా గ్యాంగ్‌ను అయితే పట్టుకున్నారు కానీ, ఆ గ్యాంగ్ వారితో ఉన్న లింక్‌లను ఛేదించడంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అన్ని కోణాల్లో కూపీ లాగుతున్నారు.

- ఉత్తరాది ముఠాతో బెజవాడకు చెందిన మహిళకు లింక్‌లు
- అక్కడి నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు
- సంతాన సాఫల్య కేంద్రాలు, ఆలయాల్లో నెట్‌వర్క్
- పిల్లలు లేనివారిని టార్గెట్ చేసి రూ.లక్షలకు విక్రయాలు
- కిడ్నాప్ చేసి తెస్తున్నారా.. ఎక్కడైనా కొంటున్నారా..?
- మధ్యవర్తులే లక్ష్యంగా పోలీసుల వేట



ఉత్తరాది నుంచి తీసుకొచ్చిన చిన్నారులతో సీపీ రాజశేఖరబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరాది నుంచి చిన్నపిల్లలను కొనుగోలు చేసి విజయవాడకు తీసుకొచ్చి విక్రయిస్తున్న ఐదుగురు మహిళల ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ముగ్గురు శిశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ప్రధానంగా ఉన్న బగలం సరోజినితో సంబంధాలు ఉన్న వారిని ఎలాగైనా బయటకు లాక్కొస్తామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. దీనికోసం నాలుగు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ముగ్గురు శిశువులను బాల సంరక్షణ కేంద్రానికి అప్పగించిన పోలీసులు మరో నలుగురు శిశువులను కూడా ఉత్తరాది నుంచి తీసుకొచ్చినట్టు సమాచారాన్ని సేకరించారు. ఈ నలుగురు శిశువులను కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉన్న సంతానం లేని దంపతులకు విక్రయించేసినట్టు తేల్చారు. ఈ శిశువులు, వారి తల్లిదండ్రులు ఎవరన్న సమాచారం పోలీసులకు చిక్కలేదు. నిందితురాళ్లు ఆ విషయాలు చెప్పడం లేదు.

ఆ మధ్యవర్తులెవరు?

ఢిల్లీకి చెందిన ప్రీతి కిరణ్.. అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ నుంచి శిశువులను కొంటున్నట్టు సరోజిని అంగీకరించింది. ఈ శిశువులను సరోజినికి అందజేసిన ఇద్దరూ.. మధ్యవర్తులేనని పోలీసులు గుర్తించారు. వారి వెనుక మరికొన్ని లింక్‌లు ఉంటాయని

మిగతా 6లో..

అన్ని జిల్లాల్లో నెట్‌వర్క్

బగలం సరోజిని విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. మారుతున్న జీవన విధానాల ప్రభావం దంపతులపై అనేక విధాలుగా పడుతోంది. ముఖ్యంగా వివాహమైన తర్వాత సంతానం కలగడం ఆలస్యమవుతోంది. దీంతో అన్ని నగరాల్లో సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతోపాటు కొంతమంది మహిళలు సంతాన సౌఖ్యం కోసం వివిధ ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఇలా సంతాన సాఫల్య కేంద్రాలు, ఆలయాల వద్ద సరోజిని ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుందని తెలుస్తోంది. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేని వారితో పరిచయాలు పెంచుకుని ఉత్తరాది నుంచి తీసుకొచ్చిన శిశువులను విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఒక్క హైదరాబాద్‌లోనే 40 మంది శిశువులను విక్రయించినట్టు అక్కడి పోలీసులు గుర్తించారు. మొత్తానికి ఈ శిశువుల విక్రయం ఓ సంచలనంగా మారింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా సరోజిని నుంచి శిశువులను కొని సంతోషపడిన దంపతులు ఇప్పుడు చిక్కుల్లో పడ్డారు. ఈ శిశువులను కొనుగోలు చేసిన వారిపైనా కేసులు నమోదు చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు.

గంజాయి బ్యాచ్ వీరంగం

8లో

కానూరు కష్టాలకు చెక్

- మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
- ఏలూరు రోడ్డు నుంచి పీవీఆర్ ఐకాన్ వరకు రెండు వరుసలుగా..
- రూ.3.54 కోట్లతో పనులు చేపట్టిన సీఆర్‌డీఏ

8లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-19 (ఆది)
సహర్ (ఉదయం) : 5-05 (సోమ)

అవినీతికి కేరాఫ్‌గా బీసీ హాస్టళ్లు

పిల్లలు తక్కువ.. రికార్డుల్లో ఎక్కువ

జిల్లాలోని బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు అవినీతికి కేరాఫ్‌గా మారుతుండగా, చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. తప్పులు చేసిన వారిని కాపాడుతూ, పట్టించిన అధికారులపై చర్యలకు దిగుతున్నారు. విజయవాడ డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సస్పెన్షన్ వెనుక జరిగింది ఇదే.

- వాచ్‌మెన్‌తో సరి.. వార్డెన్ పర్యవేక్షణ శూన్యం
- గుణదలలోని బాలికల హాస్టల్‌లో నిర్వాకం
- రిపోర్టు ఇచ్చిన అధికారి సస్పెన్షన్
- మైలవరం హాస్టల్ ఘటనపై రిపోర్టు ఇవ్వలేదనే సాకు
- ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుణదలలోని విజయవాడ సెంట్రల్ బీసీ వెల్ఫేర్ మహిళల హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యలో వాస్తవ లెక్కల కంటే చాలా తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ విషయంపై గత నెలలో విజయవాడ డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి (ఏబీసీడబ్ల్యూ) జరిపిన తనిఖీల్లో కేవలం 73 మంది పిల్లలే హాస్టల్‌లో ఉన్నట్టు గుర్తించారు. కానీ, మొత్తం 186 మంది ఉన్నట్టు హాస్టల్ సిబ్బంది లెక్కలు రాశారు. మరి మిగిలిన పిల్లలు ఎక్కడ? వారి వివరాలు ఏంటి? అన్నది ఎవరికీ తెలియదు. లెక్కల ప్రకారం.. 186 మంది విద్యార్థినులు ఉంటే.. 18 కేజీల బియ్యం వండాలి. కానీ, కేవలం 8 కేజీల బియ్యాన్నే వండుతున్నారని పరిశీలనలో తేలింది. ఈ తనిఖీల్లో సదరు హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ తప్ప ఎవరూ లేరని గుర్తించారు. వంటమనిషి, అటెండర్ కూడా కనిపించలేదు. ఉదయం సగం వదిలేసిన ఇడ్లీలను గుర్తించారు. కొందరు చాలీచాలనట్టుగా తింటుంటే, మరికొందరు విద్యార్థినులు ఇడ్లీలో చట్నీ లేక, ఇడ్లీలు కూడా నాసిరకంగా ఉండటంతో అసలు తినకుండానే స్కూల్‌కు వెళ్లినట్టు అధికారి

మిగతా 6లో..

చాలా హాస్టళ్లలో ఇదే పరిస్థితి

జిల్లావ్యాప్తంగా పలు హాస్టళ్లలో చూపిస్తున్న విద్యార్థుల సంఖ్య కంటే వాస్తవ సంఖ్య చాలా తక్కువగా ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదు. జిల్లా ఉన్నతాధికారులుగా పనిచేసిన వారికి పైస్థాయి, కిందిస్థాయిలో సత్సంబంధాలు ఉండట్లేదు. జిల్లా అధికారులుగా ఎవరు రావాలో కూడా ఓ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ రావాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్న ఆ అధికారి తిప్పిన చక్రం ఫలితంగానే విజయవాడ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

సజావుగా తొలి పరీక్ష

● ఇంటర్ ఫస్టియర్ మొదటి పరీక్షకు సెట్-2 ప్రశ్నపత్రం

● కృష్ణాలో 98.03, ఎన్టీఆర్‌లో 97.64 శాతం హాజరు



ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మచిలీపట్నం పద్మావతి కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ రాజా, జిల్లా ఇంటర్ అధికారి సాల్మన్‌రాజు

విజయవాడ/మచిలీపట్నం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష సజావుగా జరిగింది. లాంగ్వేజ్ పరీక్షలకు సెట్-2 ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేశారు. కృష్ణాజిల్లాలో 224,810 మంది విద్యార్థులకు 24,323 మంది హాజరయ్యారు. 487 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 63 కేంద్రాల్లో 98.03శాతం హాజరు నమోదైంది. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 40,695 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 39,737 మంది హాజరయ్యారు. 958 మంది గైర్హాజరయ్యారు. 103 పరీక్షా కేంద్రాల్లో 97.64 శాతం హాజరు నమోదైంది. సోమవారం నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. మచిలీపట్నంలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని బందరు డీఎస్పీ రాజా, జిల్లా ఇంటర్ అధికారి సాల్మన్‌రాజు సందర్శించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరిని క్షుణంగా తనిఖీ చేసి మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. తొలిరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు పలు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొన్నాయి.

ఎస్కార్ట్‌తోనే ప్రశ్నపత్రాలను తరలించాలి: డీఎస్పీ ధీరజ్ వినీల్



పామర్రులో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ

పామర్రు: ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాల డిపాజిట్‌ను పోలీస్ ఎస్కార్ట్‌తో చేయాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ ఆదేశించారు. పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తన సబ్‌డివిజన్ పరిధిలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ బందోబస్తు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులను ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది తనిఖీ చేశాకే లోపలకు పంపాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలన్నారు. పోలీస్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసి..



సాయిరాజును స్ట్రెచర్‌పై పరీక్షా కేంద్రానికి తరలిస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేట: కళాశాలకు వెళ్లి వస్తుండగా ప్రమాద రూపంలో విధి వక్రీకరించింది. అయినా అతను ఆత్మస్థయిర్యం కోల్పోలేదు. స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసి, అందరిలో స్ఫూర్తి నింపాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని జేఆర్సీ కళాశాలలో సాయిరాజు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. గత నెల 21న రోడ్డు మీద నడిచి ఇంటికి వెళ్తుండగా అమ్మాణీ కాలేజి రోడ్డులో యువకుడు బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. కుడి మోకాలి ఫ్రంట్ లిగ్మెంట్, బ్యాక్ లిగ్మెంట్ రెండు తెగిపోయాయి. విజయవాడలోని ఓ హాస్పిటల్‌లో 23న ఆపరేషన్ చేసి డిశ్చార్జ్ చేశారు. మోకాలి మీద బరువు పడకూడదని, రోడ్డు దెబ్బతగలటంతో వెన్నుపైనా బరువు పడకూడదని పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కానీ, సాయిరాజు ఎలాగైనా పరీక్షలు రాస్తానని తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చాడు. ఇంటర్ ఫస్టియర్ ఆందోళన అవసరం లేదని, సప్లిమెంటరీలో కొన్ని, సెకండియర్‌లో కొన్ని పూర్తి చేయొచ్చని చెప్పినా అంగీకరించలేదు. కళాశాల యాజమాన్యం దృష్టికి తేగా వాళ్లు ఇంటర్ బోర్డు అధికారులను సంప్రదించి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. వాగ్దేవి కళాశాలలో సెంటర్ ఇచ్చారు. ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక ఇన్విజిలేటర్‌ను నియమించి, పరీక్ష నిర్వహించారు. అతడు పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. శనివారం అతడిని అంబులెన్స్‌లో తీసుకుని తీసుకొచ్చి, అక్కడ నుంచి స్ట్రెచర్‌పై పరీక్షాకేంద్రంలో ప్రత్యేక ఆసనంపై కూర్చోబెట్టారు. పరీక్ష విజయవంతంగా రాసిన సాయిరాజును అందరూ ప్రశంసించారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నిరుపయోగంగా మినరల్ వాటర్‌ప్లాంట్

దాహమేస్తోంది

విజయవాడ న్యూ జీజీహెచ్‌లో తాగునీరు దొరక్క తిప్పలు | పట్టించుకోని అధికారులు

● వాటర్ బాటిళ్లతో సరిపెట్టుకుంటున్న రోగులు, వారి బంధువులు



అలంకారప్రాయంగా మినరల్ వాటర్‌ప్లాంట్

(ఆంధ్రజ్యోతి, ప్రభుత్వాసుపత్రి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో అతి పెద్దదైన విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(న్యూ జీజీహెచ్)లో తాగునీరు దొరక్క రోగులు, వారి బంధువులు అలమటిస్తున్నారు. కొత్త ప్రభుత్వాస్పత్రికి నగరంతో పాటు పరిసర జిల్లాలు, గ్రామాలు, పట్టణాల నుంచి నిత్యం వేలాదిగా వైద్యం కోసం వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రి ప్రాంగణం రోగులతో కిటకిటలాడుతూ ఉంటుంది. భారీ సంఖ్యలో వచ్చే రోగులకు అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ఆస్పత్రి అధికారులపైన ఉంది. ఎన్నో ఏళ్లుగా ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉంది. దానిని పట్టించుకోవడం లేదు. రోగుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు వాటర్ ప్లాంట్లను వితరణగా ఇచ్చాయి. వాటి నిర్వహణను ఆస్పత్రి అధికారులు నిర్లక్ష్యం చేయడంతో అవి శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు చేయించకపోవడంతో తాగునీటి సమస్య అధికమైంది. నీరు దొరక్క వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకుంటున్నామని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు.

ఉప్పు నీరే దిక్కు

ఆస్పత్రికి మంచి నీటిని సరఫరా చేసే కుళాయిలు లేవు. ఉప్పు నీటినే రోగులు తాగాల్సి వస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వజన ఆస్పత్రిని నిర్మించడంలో చూపిన శ్రద్ధ తాగునీటి కుళాయిలు ఏర్పాటులో ప్రభుత్వం చూపడం లేదు. 2016లో అప్పటి టీడీపీ హయాంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోట్లు వెచ్చించి నూతన ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటును విస్మరించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఒక కుళాయి ద్వారా ప్రధానమైన యూనిట్‌కు తాగునీరు సరఫరా అవుతోంది. మిగిలిన అన్ని విభాగాలకు తాగునీరు లేదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతానికి బోరు నీటిని అందిస్తున్నారు. బోరు నీటితో రోగులు మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు. రోగులకు నిత్యం అందించే మధ్యాహ్న భోజనం బోరు నీటితో తయారు చేస్తున్నారని, దీనివల్ల రుచి ఉండడం లేదని, భోజనం తిన్నా రోగాల పాలవుతామేమోనని భయంగా ఉందని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు. నగరపాలక సంస్థ తాగునీటిని అందించాలని కోరుతున్నారు.



ఉపకార వేతనాల చెక్కులను విద్యార్థులకు అందిస్తున్న మంత్రి కొల్లురవీంద్ర, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య

స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగండి

● సిద్ధార్థ ఫౌండేషన్ ఉపకారవేతనాల పంపిణీలో విద్యార్థులతో మంత్రి కొల్లు రవీంద్ర

మొగల్రాజపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్‌లు తీసుకున్న ప్రతి విద్యార్థి భవిష్యత్‌తో స్కాలర్‌షిప్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు. సిద్ధార్థ ఫౌండేషన్ 26వ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం వీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి విచ్చేశారు. గతంలో విద్యావకాశాలు తక్కువగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపే కారణమన్నారు. గతంలో రాష్ట్రంలో ఒకేసారి నలభై ఇంజనీరింగ్ కళాశాలు చంద్రబాబు తెచ్చారని, వాటి ఫలితాలు ఇప్పుడు మనం చూస్తున్నామని ఆయన తెలిపారు. మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తెస్తున్నారని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో కులమతాలకు అతీతంగా పేద, బలహీన, ఆర్థికంగా వెనుకబడిన 772 మంది విద్యార్థులకు 65,74,000 రూపాయలు అందించామని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. వీరిలో దేశంలో, రాష్ట్రంలో వివిధ చోట్ల చదువుతున్న 541 మందికి రూ.46,91,000, సిద్ధార్థ విద్యాసంస్థల్లో చదువుతున్న 231 మందికి రూ.18,83,000 అందించామన్నారు. వీరితో పాటు ఐఐటీ, ఐఐఎం, ఐ ఐఎస్, ఎన్ఐటీ సంస్థల్లో చదివే 16 మందికి ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందించామన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ తరపున ఇప్పటివరకు 19వేల మంది విద్యార్థులకు రూ.8.09 కోట్లను అందించామన్నారు.

ఉత్కంఠభరితంగా పూటీ లాగుడు పోటీలు



పూటీ లాగుతున్న ఎడ్లు

నందిగామ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. శనివారం సాయంత్రం సీనియర్ విభాగంలో 14 జతల ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. యజమానులకు రైతు కమిటీ సభ్యులు గింజుపల్లి శ్రీనివాసరావు, చింతోటి సాంబశివరావు, నేవెల్లి సిద్ధార్థ జ్ఞాపికలు అందజేశారు.

జూనియర్ విభాగం విజేతలు

శుక్రవారం రాత్రి జరిగిన జూనియర్ విభాగం పూటీ లాగుడు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సోపిరాలకు చెందిన విజయలక్ష్మి ఎడ్ల జత 3,514 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలేనికి చెందిన నాని ఎడ్ల జత 3,373 అడుగులు లాగి రెండో స్థానం, కృష్ణాజిల్లా కానూరు మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాస్‌రెడ్డి ఎడ్ల జత 3,350 అడుగులు, తోట్లవల్లూరు మండలం కళ్లెంవారిపాలేనికి చెందిన హనూష్‌రెడ్డి ఎడ్ల జత 3,323 అడుగులు, వత్సవాయి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి ఎడ్ల జత 3,279 అడుగుల దూరం లాగి మూడు, నాలుగు, ఐదు స్థానాలలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను రైతు కమిటీ సభ్యులు అందజేశారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,133 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలవగా రూ.ఐదువేల నగదును ప్రత్యేక బహుమతిగా అందజేశారు.

దుర్గగుడిలో రేపు హుండీల్లో కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కిస్తామని ఈవో రామచంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మహామండపంలోని ఆరో అంతస్థులో లెక్కింపు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా

పటిష్ఠ నిఘా

అక్రమాలు సహించం | ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరిక



జి.కొండూరులో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్/జి.కొండూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా అందించే పేదల బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ఠ నిఘా పెట్టాం. బియ్యం ఒక్క గింజ పక్కదారి పట్టినా సహించం. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. శనివారం జి.కొండూరులో మూడో నెంబర్ చౌకధరల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, సరుకు నాణ్యతతో పాటు డీలరు సక్రమంగా రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనేది పరిశీలించారు. ఎండీయూ-6 వాహనం ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందించే ప్రక్రియను పరిశీలించారు. రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్ల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తామన్నారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను తనిఖీ చే యాల్సిందేనని, తహసీల్దార్లు నెలకు ఐదు దు కాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. పౌరసరఫరాల డీఎం, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయాలన్నారు.

దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేస్తున్నందున దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ లక్ష్మీశ రైతులకు వివరించారు. శనివారం జి.కొండూరు మండలం గడ్డమణుగులో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రీ సర్వే పురోగతిని పరిశీలించారు. ఫీల్డ్ గ్రౌండ్ ట్రూతింగ్(భూమిపై కచ్చితత్వం) పనులు ఏ మేరకు జరుగుతున్నాయనే దానిపై ఆరా తీశారు. మ్యాపులను పరిశీలించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. ఫీల్డ్‌లో రోవర్ ఎలా పనిచేస్తుందో రైతులకు వివరించారు. పొరపాట్లకు తావులేకుండా కచ్చితమైన భూ రికార్డులను అందించేందుకు చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించుకొన్న లక్ష్యాల మేరకు సర్వే పనులను పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే, భూ రికార్డులు) టి.తివిక్రమరావు తదితరులు ఉన్నారు.

రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా మసీదుల వద్ద ఈనెల 2 నుంచి 30వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, వైద్యఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అగ్నిమాపక శాఖల అధికారులతో మాట్లాడారు. మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తెల్లవారుజామునే ముస్లింలు మసీదులకు వెళ్లి నమాజ్ చేస్తారని, వారికి ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం రానీయొద్దన్నారు. పెద్ద, చారిత్రక మసీదుల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఆహార పదార్థాలు కొనుగోలు చేసుకునేందుకు దుకాణాలకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రార్థనలు ఆచరించే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు గంట ముందే కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎండీ నూహశా అలీషా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామాయణ చిత్ర కథారూపం

● పదో తరగతి విద్యార్థి గాయత్రి అద్భుత కళా నైపుణ్యం



రామాయణ కథలో ఘట్టాలను వివరిస్తున్న గాయత్రి

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన అద్భుత చిత్రాలతో రామాయణ కావ్యానికి కథారూపమిచ్చి చేగు విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.గాయత్రి పలువురి ప్రశంసలందుకుంది. రామాయణం మొత్తాన్ని 56 చిత్రాల్లో చూపి, విద్యాలయంలో ప్రదర్శనగా ఉంచింది. తిలకించిన తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు రామాయణం బాలకాండలో అన్ని ప్రధాన ఘట్టాలను చిత్రాలతో కళ్లకు కట్టినట్టుగా చూపిందని ప్రశంసించారు. బాల రాముడికి అద్దంలో తల్లి చంద్రుడిని చూపిన దృశ్యం నుంచి అరణ్యాలకు వెళ్లడం, సీతాపహరణం, ఆంజనేయుడి ఆగమనం, రామ, రావణ ఘట్టాలు, సీతారాముల పట్టాభిషేకం, రామాయణ కావ్య రచయిత వాల్మీకి రచనా చిత్రాలకు ప్రదర్శనలో చోటు కల్పించింది. తనకు ఈ మొత్తం చిత్రాలు గీయడానికి ఏడాదిన్నర పట్టిందని పాఠశాల యాజమాన్యం సహకారంతో క్రేయాన్స్, స్కెచ్ పెన్స్ కలర్ పెన్సిల్స్ ఉపయోగించి చిత్రాలు గీశానని గాయత్రి తెలిపింది. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జిల్లా జన సేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడేపల్లి సోమేశ్వరరావు తదితరులు గాయత్రిని అభినందించారు.

కిక్కుమనకుండా..

(5వ పేజీ తరువాయి)

రెస్టారెంట్లకు చీప్ లిక్కర్ సీసాలను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేస్తున్నారు. మద్యం దుకాణంలో రూ.110 ధర ఉన్న సీసా, బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.150కు విక్రయించుకునే వెసులుబాటు ఉంది. దీంతో ఈ రకం మద్యం సీసాలు మద్యం దుకాణాల నుంచి బార్ అండ్ రెస్టారెంట్లకు చేరిపోతున్నాయి. వీటిని బహిరంగంగానే విక్రయిస్తున్నా పట్టించుకునేవారు లేరు. ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చినా.. తమ దృష్టికి రాలేదని, లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పి తప్పించుకుంటున్నారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మద్యం దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు అందుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్ని మద్యం దుకాణాలుంటే ఒక్కో షాపు నుంచి రూ.15 వేలు, అదనపు ఖర్చుల కింద మరో రూ.5 వేలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. దీంతోపాటు ఎక్సైజ్ జిల్లా కార్యాలయానికి ఒక్కో షాపు నుంచి రూ.6 వేలు, డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి రూ.8 వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు బాహాటంగానే చెబుతున్నారు. ఇక స్థానిక పోలీసులకు ఒక్కోషాపు నుంచి నెలకు కనీసం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ అందుతోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

అవినీతికి కేరాఫ్‌గా బీసీ హాస్టళ్లు

(5వ పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. బాలికల హాస్టల్ విషయంలో ఎంతో జాగ్రత్తగా చూడాల్సిన వార్డెన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆయన గుర్తించారు. ముగ్గురు పనిచేయాల్సిన హాస్టల్‌లో ఒక్కరే ఉంటే బాలికల రక్షణ ఏమిటని ఆయన ప్రశ్నించారు. వార్డెన్ ఐదేళ్లకు పైగా ఇక్కడే పాతుకుపోయి పనిచేస్తుండటం, బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని ఆయన గుర్తించారు. హాస్టల్‌లో వాస్తవంగా ఉన్న విద్యార్థులు, అక్కడి అధ్వాన పరిస్థితులు, వార్డెన్ నిర్వాకాలపై ఆయన జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

అధికారిపై చర్యలా..?

గుణదల హాస్టల్ వార్డెన్‌పై తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కబెట్టారు. కానీ, నివేదిక ఇచ్చిన సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిపైనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సస్పెండ్ చేశారు. మైలవరం బాలికల హాస్టల్‌కు సంబంధించి అలక్ష్యంగా ఉన్నారని ఈ చర్యలు తీసుకున్నారు. మైలవరం బాలికల హాస్టల్ వార్డెన్ తరచూ విధులకు గైర్హాజరవుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై సదరు అధికారి గతంలో పలు మార్లు తనిఖీలు చేశారు. వార్డెన్ అందుబాటులో లేని విషయాన్ని గమనించారు. ఈ ఉదంతాలపై జిల్లా అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయకపోయినా మౌఖికంగా తెలియజేశారు. ఈ ఘటనలో తమకు రిపోర్టు ఇవ్వటంలో అలక్ష్యం నెలకొందన్న కారణంగా సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిని బాధ్యుడిని చేస్తూ వార్డెన్‌తో పాటు సస్పెన్షన్ విధించారు. ఇదే అధికారి గుణదల విషయంలో అధికారికంగా ఫిర్యాదు చేస్తే మాత్రం పట్టించుకోలేదు.

పసిబిడ్డలపై పైసాచికం

(5వ పేజీ తరువాయి)

అనుమానిస్తున్నారు. ప్రీతి కిరణ్, అనిల్‌ను అరెస్టు చేసి విచారణ చేస్తే శిశువులకు సంబంధించిన సమాచారం గానీ, నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర లింక్‌లు గానీ బయటకొచ్చే అవకాశం ఉంది. పోలీసులు ప్రధానంగా రెండు అంశాలపై దృష్టిపెట్టారు. ఉత్తరాదిలో ఉన్న వివిధ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులను దొంగిలించి తీసుకొచ్చి సరోజినికి విక్రయించి ఉంటారని ఓ కోణంలో అనుమానిస్తున్నారు. లేనిపక్షంలో మురికివాడల్లో ఉన్న నిరుపేదలు.. పోషించే శక్తి లేకపోవడంతో విక్రయించి ఉంటారని భావిస్తున్నారు. ప్రీతి కిరణ్, అనిల్‌తో సరోజినికి లింక్‌లు కలిపిన మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. సరోజిని కొన్నేళ్లు ఇలా శిశువులను విక్రయించడం ద్వారా లక్షలాది రూపాయలను సంపాదించింది.

అద్దె బకాయిలు రూ.అరకోటిపైనే

● విజయేశ్వరస్వామి దేవస్థానం షాపుల అద్దె వసూళ్లపై పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి): ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న విజయేశ్వరస్వామి ఆలయ షాపుల బకాయిలు రూ.అరకోటికిపైనే పేరుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి దేవదాయ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సుమారు కోటిన్నరతో దేవస్థానం అభివృద్ధితో పాటు చైనావాల్ పక్కన తొమ్మిది షాపుల నిర్మించారు. ఆనాడు షాపులను పాడుకున్న అద్దెదారుల్లో కొందరు రెండు మూడు నెలలు సక్రమంగా అద్దె చెల్లించారు. మరికొందరు అద్దె చెల్లించలేదు. అద్దె బకాయిలపై అప్పటి ఈవో పట్టించుకోకపోవటంతో సుమారు అరకోటికి పైగా బకాయిలు పేరుకుపోయాయి.

ఏడాదిన్నర నుంచి షాపుల మూసివేత

అద్దెదారులు అద్దె చెల్లించకపోగా, సుమారు ఏడాదిన్నర నుంచి షాపులు మూసివేసి ఉంచారు. దేవస్థానం అధికారులు బకాయిల వసూలుపై ఒత్తిడి చేయకుండా కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని, షాపులన్నీ ఖాళీగా ఉండటంతో దేవస్థానానికి రూ.లక్షల్లో ఆదాయం గండిపడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానం షాపుల ముందు కొందరు హాకర్లు అద్దె చెల్లించకుండా జోరుగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దేవస్థానంలో పనిచేసే ఓ గుమస్తా అంతా తానై వ్యవహరిస్తున్నారని, దుకాణాల ముందు వ్యాపారాలు చేసుకుంటున్న హాకర్ల వద్ద మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎదురుగా ఉన్న దర్గా ప్రాంగణంలో షాపుల అద్దెలు వేలల్లో సక్రమంగా ప్రతినెలా వసూలవుతుంటే, విజయేశ్వరస్వామి దేవస్థానం షాపుల అద్దె వసూళ్ల చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షాపులు ప్రస్తుతం నిరుపయోగంగా అలంకార ప్రాయంగా మారాయి.

బకాయిల వ్యవహారం తెలియదు

దేవస్థానానికి చెందిన షాపుల బకాయిల వ్యవహారం నాకు తెలియదు. నెలన్నర క్రితమే ఈవోగా బాధ్యతలు స్వీకరించా. - వెంకట రెడ్డి, ఈవో

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఉయ్యూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉయ్యూరులో శ్రీశ్రీనివాసా, ఏజీ అండ్ ఎస్ జీఎస్, నారాయణ, శ్రీచైతన్య, శ్రీవిశ్వశాంతి జూనియర్ కళాశాలల్లో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు కస్టోడియన్లుగా సోమయ్య, చౌడయ్య వ్యవహరిస్తున్నారు.

గన్నవరం : మండలంలో ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. వీకేఆర్ కళాశాల, చైతన్య కళాశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులు వచ్చారు.



ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

బిల్లులు రావు.. పనులు కావు

- నత్తనడకన వాటర్ ట్యాంక్ నిర్మాణం
- రెండేళ్లుగా కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు 14వ వార్డులో రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన వాటర్ ట్యాంక్ నిర్మాణం నత్తనడక నడుస్తూ పూర్తికాక పోవడంతో పరిసర ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 97.13 లక్షలతో 250కేఎల్ సామర్థ్యంతో 2023 మార్చిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన తరువాత ప్రారంభమైన నిర్మాణ పనులు నేటికి పూర్తి కాలేదు. ట్యాంక్ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు పిల్లర్ల వరకు నిర్మించినప్పటికి గత ప్రభుత్వంలో బిల్లులు రాక పోవడంతో సుదీర్ఘకాలం పనులు నిలిపివేశాడు. దీంతో ట్యాంకు కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు తుప్పుపట్టి పాడైపో తుండగా వార్డు ప్రజల ఆందోళనతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు తిరిగి ప్రారంభించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా కొద్ది రోజులు పనులు నిలిచిపోయి ఇటీవలే పునఃప్రారంభించారు. 14వ వార్డుతో పాటు పలు వార్డుల ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న ట్యాంక్ పనులు పూర్తికాక పోవడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పనులు వేగవంతం చేసి ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఉయ్యూరు 14వ వార్డులో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్



పశువులకు టీకాలు వేస్తున్న విజయవాడ డివిజన్ ఉప సంచాలకులు రమేష్

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ప్రసాదంపాడు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరైతు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ విజయవాడ డివిజన్ ఉపసంచాలకులు రమేష్ అన్నారు. శనివారం విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని పశు వైద్యశాలలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు రైతుల ఇళ్ల వద్దకే వచ్చి వేస్తున్నట్టు తెలిపారు. నిడమానూరు పశువైద్యశాల పశు వైద్యాధికారి కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ, నిడమానూరు, ఎనికేపాడు గ్రామాల్లో 10వ తేదీ వరకు.. ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో 11 నుంచి 20 తేదీ వరకు టీకాలు వేస్తామని తెలిపారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రావణి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఖాసిం పాల్గొన్నారు.



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చిన్నికృష్ణ

అవగాహనతోనే క్షయవ్యాధి నిర్మూలన

ఉంగుటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలన అవగాహనతోనే సాధ్యమని జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని ఆత్కూరు రీచ్ వొకేషనల్ కళాశాలల్లో క్షయవ్యాధి పట్ల అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయవ్యాధి అంటువ్యాధి అని ఏ వ్యక్తికి అయితే ఒకటి, రెండు వారాలు నుంచి దగ్గు ఉందో, రెండు వారాలకు పైబడి జ్వరం రావటం, ఆకలి మందగించటం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, ఒక్కొక్కసారి దగ్గినప్పుడు వచ్చే కళ్లెలో రక్తం పడటం ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అని తెలిపారు. వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కళ్లె పరీక్షను ఉచితంగా చేయించుకుని నిర్ధారణకు వచ్చి తగిన చికిత్స పొందాలని వివరించారు. టీబీ యూనిట్ సిబ్బంది సాంబశివరావు, రఘు, మాలతి, సరళ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానులు సీతారామాచార్యులు స్వామి వారికి సుప్రభాత సేవతో పాటు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అవిర్నేని తారక బ్రహ్మం, దోణవల్లి పుష్పావతి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో స్వామిని పుష్పాలంకరణ చేశారు. పూజా కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న సైన్స్

గన్నవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రపంచాన్ని శాసిస్తుందని ప్రిన్సిపాల్ ఎస్‌కె బాషా అన్నారు. స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం సైన్స్ ఫేర్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు అందరిని ఆకట్టుకున్నాయి. వినూత్న పద్ధతులలో తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫేర్ దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు చేసిన సైన్స్ ప్రాజెక్టు

నేటి నుంచి రంజాన్ నెల ప్రారంభం

● విద్యుత్ అలంకరణలో మసీదులు

గన్నవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల ప్రారంభం కావటంతో మసీదులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నెలవంక దర్శనంతో ఆదివారం నుంచి ఉపవాసాలు ప్రారంభమవుతాయని ముస్తాబాద మసీద్ ఇమాం హఫీజ్ హనీస్ ఇక్బాల్ తెలిపారు. గ్రామంలోని మసీదుకు లైటింగ్ ఏర్పాటు చేశారు. ఉపవాసం ఉండే భక్తుల కోసం, ఉపవాస దీక్ష విరమణ కోసం ఏర్పాట్లన్ని పూర్తి చేశామని చెప్పారు. భక్తి శ్రద్ధలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేయాలని సూచించారు.



ముస్తాబాదలో విద్యుత్ కాంతులతో మెరుస్తున్న మసీద్



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి

సామాజిక సేవకు సరైన వేదిక లయన్స్‌క్లబ్

● జంక్షన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అవసరాలను గుర్తెరిగి సేవలందించడంతో పాటు సామాజికంగా చేయూత నిచ్చేలా సహకారం అందించడానికి వేదిక లయన్స్‌క్లబ్‌లేనని గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. రంగన్నగూడెంలో శనివారం నిర్వహించిన హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో పర్యటిస్తూ ఆర్ ఆర్ డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనీటైం వాటర్ మిషన్‌ను, పీఏసీఎస్ గోడౌన్, తదితర గ్రామాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. తదనంతరం ఎంపీపీ స్కూల్‌లో ఆళ్ల గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆళ్ల సావిత్రమ్మ మెమోరియల్ స్కాలర్ షిప్‌లను మండపాటి పూర్ణజ్యోతి, దారం కమలినిలకు ఒక్కొక్కరికీ రూ. 10వేల నగదు అందజేశారు. ఎన్నారై ఆళ్ల సౌమ్య సహకారంతో 100మంది విద్యార్థులకు పుస్తకాలు, తదితర సామగ్రి అందజేశారు. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానిక సచివాలయ ఆవరణలో లయన్స్ జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఇటీవల అస్వస్థతకు గురైన లయన్స్ మాజీ గవర్నర్ వీరమాచనేని రామబ్రహ్మంను పరామర్శించారు. హనుమాన్‌జంక్షన్‌లోని లయన్స్‌క్లబ్ భవన అభివృద్ధి పనులను, సెంట్రల్ ఏసీ హాలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల రామారావు, శ్రీని వాసరెడ్డి, ఎస్.ఎన్వీ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, జాన్‌బాబు, భాను సుందర్‌కుమార్, నందిగం స్వామి, ఫణి, అక్కినేని రాఘవేంద్రరావు, తమిరి రమేష్, చలసాని వెంకటేశ్వరరావు, రంగారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం గ్లోరీస్వర్ణలత, మండపాటి రాంబాబు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత వెలగపూడి జన్మదినం

పెనమలూరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకులు, టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకరబాబు జన్మదిన వేడుకలు శనివారం కానూరు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు వెలగపూడికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శంకరబాబు కార్యాలయంలో కేకు కట్ చేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. వెలగపూడిని అభినందించిన వారిలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి ముక్కపాటి శ్రీనివాస్, వల్లూరు అన్నపూర్ణ, బలగం కొండ, వెలగపూడి రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



వెలగపూడి శంకరబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



కానూరు జనసేన కార్యాలయంలో మాట్లాడుతున్న తాతపూడి గణేష్

దువ్వాడ శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకో

జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్

పెనమలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ హెచ్చరించారు. శనివారం కానూరు జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడ శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఒకప్పుడు పోసాని నోటికి అడ్డూ అదుపు లేకుండా మాట్లాడాడు...కూటమి నాయకుల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని...ఇలాంటి వ్యక్తిని పోలీసులు చట్టం ముందు నిలబెడితే దువ్వాడ, జగన్‌రెడ్డి సమర్థించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దువ్వాడకు దమ్ము, ధైర్యం ఉంటే చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని సవాల్ విసిరారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేసే పక్షంలో దువ్వాడకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

అమరుల త్యాగాలు వృథా కానివ్వం

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు మాదిగ

గన్నవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అమరుల త్యాగాలు వృథా కావని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ముస్నంగి నాగరాజు మాదిగ అన్నారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద శనివారం అమరవీరుల దినోత్సవం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధించిన రోజు మాత్రమే మాదిగల అమరవీరులకు నిజమైన నివాళులర్పించినట్లు అని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యం కోసం ఎంతో మంది మాదిగలు తమ విలువైన ప్రాణాలను అర్పించారని వారి త్యాగాలు వృథా కానివ్వమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు ఎస్సీ వర్గీకరణ త్వరలోనే చేస్తారని విశ్వాసం మాదిగ జాతికి ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై విద్య, ఉద్యోగం, రాజకీయ, సంక్షేమ రంగాల్లో అధ్యాయానికి నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తన నివేదికను వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. వర్గీకరణ అమలయ్యేంత వరకూ ఎలాంటి ఉద్యోగ భర్తీల నోటిఫికేషన్‌లు విడుదల చేయరాదని కోరారు. నాయకులు మందా వేణు, దేవరపల్లి విక్టర్‌బాబు, కోట కృష్ణమోహన్, నాగేశ్వరరావు, రమేష్, వరప్రసాద్, రాబర్ట్ జాన్సన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వద్దు

గురుకుల పాఠశాలలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ

మోపిదేవి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం, విద్యాబోధన, భోజనం మెనూ పాటించటంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమం, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ చెప్పారు. శనివారం ఉదయం మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ నేరుగా తరగతి గదుల్లోని విద్యార్థుల వద్దకు వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తెలుగు, గణిత పాఠ్యాంశాలు విద్యార్థులు ప్రదర్శనపూర్వకంగా కృత్యాధారణ పద్ధతిలో బోధించాలని ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. తరగతి గదులు, టాయిలెట్లు, రాత్రి సమయాల్లో ఎలా ఉంటున్నారంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం డైనింగ్ హాల్ సమస్యగా ఉందని, నూతన హాలు నిర్మించాలంటూ విద్యార్థులు చెప్పారు. తీరప్రాంత విద్యార్థులకు రాబోయే కాలంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించేలా అధికారులు శ్రమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజన పదార్థాలను తనిఖీ చేశారు. భోజనం తయారీ, వడ్డించే సమయాల్లోనూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.వీర రవి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న రైతులు

అక్రమ వంతెన నిర్మాణాన్ని తొలగించాలి

- లేకుంటే ఉద్యమం చేపడతామని రైతుల నిరసన

నందివాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో మురుగు కాలువపై అక్రమంగా వంతెన నిర్మాణం చేపట్టడాన్ని నిరసిస్తూ రైతులు ధర్నా చేపట్టారు. రామాపురం నుంచి అలిపిరాల వెళ్లే రహదారిలో కొన్ని వేల ఎకరాల చేపల చెరువుల్లోని మురుగునీటిని వదిలేందుకు ఉపయోగించే ఈ కాలువపై వైసీపీకి చెందిన పోతునూరి నాగబాబు అనే వ్యక్తి ఇరిగేషన్, డ్రైనేజీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా తన చెరువులోకి అక్రమంగా వంతెన ఏర్పాటు చేశారని, దీంతో దిగువనున్న చేపల చెరువులు, పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందున్నారు. అధికార పార్టీ నేతల అండతో కాలువపై అక్రమంగా తూమును ఏర్పాటు చేసి వంతెన నిర్మించాడన్నారు. భవిష్యత్తులో ఎన్నో పంట పొలాలు, ఆక్వా సాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. గత వరదల్లో వంతెనలు లేకపోయినా నీటి ప్రవాహం సరిగ్గా లేక చెరువులు పంట పొలాలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ డీఈని ఫోన్‌లో సంప్రదించగా, తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే వంతెన తొలగించాలని, లేకుంటే ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన ఆక్వా రైతు మెరుగుమాల లక్ష్మణరావు, రామాపురం నీటి సంఘం అధ్యక్షుడు సురేష్, వెన్ననపూడి టీడీపీ గ్రామ నేత పొట్లూరి స్వామి, రైతులు పాల్గొన్నారు.


పట్టుబడిన రేషన్ బియ్యంతో నిందితుడు రాంబాబు

కొయ్యూరులో రేషన్ బియ్యం పట్టివేత

- 15.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గ్రామంలో పరదాలు కప్పి అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం అధికారులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. గన్నవరం, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం కొయ్యూరు గ్రామంలో పరదాలు కప్పి రేషన్ బియ్యాన్ని నిలువ చేస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా 32 బ్యాగుల్లో నిల్వ ఉంచిన సుమారు 15.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పల్లెర్లమూడి గ్రామాలతో పాటు బాపులపాడు మండలంలోని బొమ్ములూరు, బిళ్లనపల్లి వంటి గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని కొయ్యూరు వద్ద నిలువ ఉంచి చేపల మేతకు వినియోగించే పిల్లెట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీకి వినియోగించుకునేందుకు తరలిస్తున్నట్టు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మల్లవల్లి రాంబాబు అనే వ్యక్తి తెలిపినట్లు వివరించారు. తండ్రీ కొడుకులైన మల్లవల్లి రాంబాబు, శ్యామ్ కలిసి ఈ అక్రమ రేషన్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. బియ్యాన్ని స్థానికంగా ఉన్న ఒక రైస్ మిల్లులో ఉంచి, రాంబాబును అదుపులోకి తీసుకుని 6ఏ, 7సీ కేసులు నమోదు చేసినట్టు ప్రధాన్ తెలిపారు.

గంజాయి బ్యాచ్ వీరంగం

గంజాయి సేవించాలంటూ బలవంతం.. వినలేదని దాడి

పెనమలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లతో గంజాయి తాగించడానికి బలవంతం చేసి, అడ్డుకున్నందుకు వారి బంధువులపై దాడిచేసి చేతులు విరిచిన గంజాయి బ్యాచ్ బీభత్సంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరు సనత్‌నగర్ మదీనా మసీద్‌కు సమీపంలో నివాసముండే షేక్ అబ్దుల్‌కు అబ్దుల్ హకీం, అబ్దుల్ రహీం అనే ఇద్దరు కుమారులు. గతేడాది వీరిపై రిజ్వాన్, నయీం, కరీం, బుడా అనే మైనర్ బాలురు గొడవ పడడంతో అబ్దుల్ వారిని హెచ్చరించి వదిలేశాడు. ఫిబ్రవరి 25న తన కుమారులు హకీం, రహీం దగ్గర్లోని మసీదుకు వెళ్లి వస్తుండగా దారిలో నయీం, నజీర్, కరీం, సమీర్, బుడా అడ్డగించి తమ కుమారులతో బలవంతంగా గంజాయి తాగాంచేందుకు యత్నం చేశారు. గంజాయి తాగకుంటే నరికేస్తామని బెదిరించి దాడి చేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకొన్న అబ్దుల్ తన బావమరుదులైన సలీం, ఖలీల్‌ను తీసుకొని మదీనా మసీదు వద్దకు వెళ్లి ఆపే ప్రయత్నం చేయగా మత్తులో ఉన్న ఆ అయిదుగురు కర్రలు, రాడ్లతో దాడి చేసి కారం చల్లేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో అబ్దుల్ కుడి చేయి విరగ్గా అతడి బావమరుదులకు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. అబ్దుల్ తోడల్లుడి ప్రైవేట్ భాగాలపై తీవ్రంగా దాడి చేసి కొట్టారు. అంతేకాక బలవంతంగా గుర్తు తెలియని రసాయనం తాగించారు. తాము చెప్పినట్టు వినకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో భయకంపితుడైన అబ్దుల్ తన బంధువులు, కుమారులతో కలిసి పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పొరుగు దేశం బర్మా (ప్రస్తుతం మయన్మార్) పేరుతో నగరంలో ఓ కాలనీ ఉందన్న విషయం చాలామందికి తెలియదు. అసలు బర్మా పేరుతో కాలనీ ఏంటబ్బా అనే అనుమానం అక్కర్లేదు. నిజంగానే బర్మా పేరుతో నగరంలో ఓ కాలనీ ఉంది. 40 ఏళ్లుగా ప్రజలిక్కడ నివాసం ఉంటున్నారు. వారి ఆధార్, రేషన్ కార్డులు, పాస్‌పోర్ట్ సహా ప్రతి ఐడీలోను బర్మా పేరు నమోదై ఉంటుంది. మన దేశం నుంచి వ్యాపారులుగా వెళ్లి శరణార్థులుగా తిరిగొచ్చిన కాలనీవాసుల కథలో అనేక మలుపులున్నాయి. నగరంలోని పాయకాపురంలో ఉన్న బర్మా కాలనీ కథా కమామీషు ఏమిటో తెలుసుకుందాం.

- ఆంధ్రజ్యోతి, పాయకాపురం



నగరంలో బర్మా కాలనీ

- నేటికీ అదే పేరుతో కొనసాగింపు
- వ్యాపారులుగా వెళ్లి.. శరణార్థులుగా తిరిగొచ్చి..
- అప్పట్లో రంగూన్‌లో వ్యాపారాలన్నీ మన వాళ్లవే..!
- అక్కడి సైనికపాలనతో కట్టుబట్టలతో స్వదేశాలకు
- 40 ఏళ్లగా పాయకాపురంలో స్థిర నివాసాలు



బ్రిటీషు వారి పాలనలో భారత దేశం దక్షిణాది రాష్ట్రాలు బర్మాతో బలమైన వాణిజ్య సంబంధాలు కలిగి ఉండేది. దీంతో అనేక కుటుంబాలు వివిధ వ్యాపారాల నిమిత్తం బర్మాకు వలస వెళ్లాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రం నుంచి కూడా వందలాది కుటుంబాలు బర్మాకు వలసవెళ్లి అప్పటి బర్మా రాజధాని రంగూన్‌లో స్థిరపడ్డారు. అక్కడ మనవాళ్ల సంఖ్యాబలం వ్యాపారంలో మెళకువలతో రాణించడమే కాకుండా ఆధిపత్యం ప్రదర్శించే స్థాయికి వెళ్లిపోయారు. దాదాపుగా రంగూన్‌లో వ్యాపారాలన్నీ మనవాళ్ల చేతుల్లోనే ఉండేవి.

మలుపుతిప్పిన సైనికపాలన

మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టు సాగిపోతున్న మనవాళ్ల జీవితాలు అనుకోకుండా మలుపుతిరిగింది. 1962లో బర్మాలో సైనిక పాలన రావడంతో ఒక్కరాత్రిలోనే భారతీయుల జీవితాలు తల్లకిందులైపోయాయి. అప్పటి వరకు వారు సంపాదించుకున్న ఆస్తులు, వ్యాపారాలు అప్పటి ప్రభుత్వం లాగేసుకుంది. ఆంక్షలు పెరిగిపోయాయి. ప్రైవేటు వ్యాపారాలన్నీ జాతీయం చేశారు. లైసెన్సులు ఇచ్చేవారు కాదు. పైగా వెంటనే తమ తమ స్వదేశాలకు వెళ్లిపోవాల్సిందిగా హుకుం జారీ చేశారు. కేవలం తమ స్వదేశానికి వెళ్లేందుకు అవసరమైన కొంత నగదు మాత్రమే తిరిగిచ్చారు. ఇన్ని కఠిన ఆంక్షల నడుమ కొన్ని వేల కుటుంబాలు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో అప్పటి ప్రభుత్వం రవాణా ఏర్పాట్లు చేయడంతో అప్పటి వరకు తాము సంపాదించుకున్న ఆస్తులు, సంపద, వ్యాపారాలు అన్నీ కట్టుబట్టలతో కొందరు రైళ్లు, మరికొందరు ఓడల్లో, మరి కొందరు కాలిబాటన స్వదేశానికి తిరిగి వచ్చేశారు. మార్గమధ్యంలో ఎంతోమంది ప్రాణాలు వదిలిన వారు ఉన్నట్టు కాలనీ వాసులు అప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ చెబుతున్నారు.

స్వదేశంలో కాలనీల నిర్మాణం

అప్పట్లో మనదేశానికి ప్రధానమంత్రిగా ఉన్న లాల్‌బహదూర్ శాస్త్రి స్వదేశానికి తిరిగి వచ్చిన భారతీయులు ఏ రాష్ట్రాల నుంచి వలస వెళ్లారో గుర్తించి ఆయా రాష్ట్రాల్లో కాలనీలను నిర్మాణం చేసి వసతి కల్పించారు. ఈ క్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోను బర్మా కాలనీల నిర్మాణాలు జరిగాయి. అందులో భాగంగా నగరంలోని పాయకాపురం ప్రాంతంలో 131 ఇళ్లతో బర్మా కాలనీ ఏర్పాటైంది. 60 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చిన వీరికి 1964 ఆగస్టు 14న బర్మాకాలనీలో ఇళ్లు కేటాయించింది. అప్పటి నుంచి కాలనీ పేరు బర్మా కాలనీగానే స్థిరపడిపోయింది.

పంచాయతీలో నిధుల దుర్వినియోగం

జూనియర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఈవోపీఆర్‌డీ ఫిర్యాదు

కూచిపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామ పంచాయతీలో రూ.10,77,132 నిధులు దుర్వినియోగానికి పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ సిద్దెల సురేంద్రబాబుపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ మొవ్వ మండల పరిషత్ పంచాయతీల విస్తరణాధికారి (ఈవోపీఆర్‌డీ) ఎం.ఎస్.కె.పరమాత్మ కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో వసూలు చేసిన ఇంటి పన్నులు, నీటితీరువా, ఇతర పన్నులకు సంబంధించిన నిధులను గ్రామ పంచాయతీకి జమ చేయకుండా గతేడాది సొంత అవసరాలకు వాడుకున్నాడని పేర్కొన్నారు. అప్పట్లోనే పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఏడీవీఎల్ ప్రసాద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఉన్నతాధికారుల విచారణలో నిధులు దుర్వినియోగమైనట్టు తెలియడంతో గతేడాది జూలై 1న అతడిని సస్పెండ్ చేశారన్నారు. స్టాంపులు, పత్రాల ఫోర్జరీనే కాక నిధులు దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల ప్రకారం సురేంద్ర బాబుపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాజ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు అప్పట్లోనే తాను లోకాయుక్తకు ఫిర్యాదు చేశానని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు. విచారణ చేపట్టిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు దుర్వినియోగమైనట్టు లోకాయుక్తకు నివేదిక ఇచ్చారన్నారు.


కాజ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఫిర్యాదు అందింది: ఎస్‌ఐ

దీనిపై కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యాన్ని వివరణ కోరగా ఈవోపీఆర్‌డీ పరమాత్మ ఫిర్యాదు వాస్తవమేనని ధ్రువీకరించారు. కొన్ని డాక్యుమెంట్లు సమర్పించాడని, మరికొన్ని అందాల్సి ఉందని, ఒకటి, రెండు రోజుల్లో కేసు నమోదు చేస్తామని తెలిపారు. సకాలంలో స్పందించి ఉంటే ఇలాంటి సంఘటనలు జరిగి ఉండేవి కాదని కాజ గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఇన్‌విక్టా నగర విద్యార్థికి

రూ.2.40 కోట్ల ఉపకార వేతనం


మాట్లాడుతున్న విద్యార్థి ఆదిత్య

మొగల్రాజపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద చదివి న తమ విద్యార్థికి నాలుగేళ్ల కంప్యూటర్ సైన్సు కోర్సులో రూ.2.40 కోట్ల ఉపకార వేతనం లభించిందని ఇన్విక్ట మేనేజింగ్ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి తెలిపారు. గాయత్రీనగర్‌లోని కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి మిరియాల ఆదిత్య అమెరికాలో టాప్ 10 వర్సిటీల్లో ఒకటైన మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశంతోపాటు ఉపకార వేతనం సాధించాడన్నారు. రెండేళ్లు కష్టపడి శాట్ అండ్ ఐఈఎల్‌టీఎస్ ప్రవేశపరీక్షలో భాగంగా ఇంటర్ ఫస్టియర్‌లో 98శాతం మార్కులు సాధించి ప్రతిభ చూపి తెలుగు రాష్ట్రాల్లో ఈ ఘనత సాధించిన మొదటి విద్యార్థిగా నిలిచాడన్నారు. ఆదిత్య తో పాటు మరో 15 మంది విద్యార్థులకు కూడా రూ. కోటికి పైగా ఉపకార వేతనం లభించిందన్నారు. ఆదిత్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఇన్విక్టా వివేకానంద మూర్తి శిక్షణ ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. ప్రస్తుతం ఆదిత్య చదువుతున్న శారద జూనియర్ కళాశాల డైరెక్టర్ శారదాదేవి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్విక్టా డైరెక్టర్లు కెఎస్ కృష్ణమోహన్, సౌమ్యదీప్ చక్రవర్తి తదితరులు ఆదిత్యను శాలువాతో సత్కరించారు.


వంశీ రామరాజుకు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేస్తున్న మండలి బుద్ధప్రసాద్, వేణుగోపాల్ ప్రభాకర్ తదితరులు

వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత

వంశీ రామరాజుకు స్వర్ణకంకణ ప్రదానం

విజయవాడ కల్చరల్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, సినీ రంగాలకు వంశీ అందించిన సేవలు విశేషమైనవని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శారద కళా సమితి, స్వరలయ, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత వంశీ రామరాజుకు స్వర్ణకంకణం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వంశీ 54ఏళ్లుగా తన జీవితాన్ని కళాసేవకే కాక సామాజిక స్పృహతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టి, జాతీయంగానే కాక అంతర్జాతీయంగానూ మన తెలుగు సంస్కృతి బావుటాను ఎగరేశారన్నారు. భారత రాష్ట్రపతి నుంచి శిరోమణి అవార్డు సహా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారన్నారు. అనంతరం సాంస్కృతిక సేవా సేనాధిపతి బిరుదు ప్రదానం చేసి స్వర్ణకంకణం తొడిగారు. విశ్రాంత న్యాయమూర్తి టి.వేణుగోపాలరావు, సంస్థ నిర్వాహకులు స్వరలయ సంస్థకు చెందిన ఎస్ఆర్ ప్రభాకర్, మోహన్ రామప్రసాద్, ఎస్వీ రామూర్తి పాల్గొన్నారు. ముందుగా గాయనీ, గాయకులు టి.బాలకామేశ్వరరావు, వైఎస్ రామకృష్ణ, పీ శాంతిశ్రీ, ఇందు నయన మధురగానం చేసి శ్రోతలను అలరించారు. స్వరసౌరభం శీర్షికతో వాళ్లు సాగించిన సంగీత విభావరి ముగ్ధుల్ని చేసింది.

ఎన్టీఆర్ జిల్లాలో 92.48 శాతం పెన్షన్ల పంపిణీ

- 2,11,918 మందికి పెన్షన్ల పంపిణీ
- రూ. 90.39 కోట్లు పంపిణీ
- జీ కొండూరు మండలంలో అత్యధికంగా 94.21% పంపిణీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో పెన్షన్ల పంపిణీ శనివారం 92.48 శాతం మేర పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,29,155 మంది పెన్షన్‌దారులుండగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఆర్‌డీఏ నేతృత్వంలో 2,11,918 మందికి పెన్షన్లను పంపిణీ చేశారు. మొత్తం రూ.98.09 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉండగా రూ. 90.39 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ జరిగింది. జిల్లాలోని జీ కొండూరు మండలంలో 8510 పెన్షన్లకు గాను 8107 మందికి (94.21%), మైలవరం మండలంలో 9526 పెన్షన్లకు గాను 8970 మందికి (94.16), తిరువూరు అర్బన్‌లో 3345 పెన్షన్లకు గాను 3149 మందికి (94.14%), ఇబ్రహీంపట్నం మండలంలో 4751 మంది పెన్షనర్లకు 4472 మందికి (94.13%), విజయవాడ అర్బన్‌లో 66,505 మందికి గాను 62,519 మందికి (94.01%), జగ్గయ్యపేట అర్బన్‌లో 4825 మందికి 4536 మందికి (94.01%), విస్సన్నపేటలో 8109 మందికి గాను 7617 మంది(93.93%), కొండపల్లి అర్బన్‌లో 5228 మందికి గాను 4887 మందికి (93.48%), నందిగామ అర్బన్‌లో 4205 మందికి గాను 3930 మంది (93.46%), విజయవాడ రూరల్‌లో 17,223 మందికి గాను 15,996 మందికి (92.88%), ఏ కొండూరు మండలంలో 7316 మందికి 6752 మందికి (92.29%), గంపలగూడెం మండలంలో 11,321 మందికి 10,446 మంది (92.27%), కంచికచర్ల మండలంలో 10,139 మందికి, 9341 మందికి (92.13%), తిరువూరులో 6728 మందికి 6190 మందికి (92%), వత్సవాయిలో 9511 మందికి 8651 మందికి (90.96%), రెడ్డిగూడెంలో 7104 మందికి 6446 (90.74%), నందిగామలో 7845 మందికి 7098 (90.48%), జగ్గయ్యపేటలో 10,150 మందికి 9,158 మంది (90.23%), వీరులపాడులో 8639 మందికి 7783(90.99%), పెనుగంచిప్రోలులో 8376 మందికి 7401 మంది (88.36%), చందర్లపాడు మండలంలో 9799 మందికి 8559మంది (87.35%) చొప్పున పంపిణీ చేశారు.


పింఛన్‌దారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

క్షేత్రస్థాయిలో కలెక్టర్ లక్ష్మీశ తనిఖీలు

మొగల్రాజపురం/మధురానగర్: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్టీయార్ భరోసా పింఛన్ల పంపిణీ సజావుగా జరిగిందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. నగర పరిధిలోని మధురానగర్, మధ్యకట్ట ప్రాంతంలో పర్యటించి పంపిణీని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కొంతమంది పింఛన్‌దారులతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభమైందన్నారు. 2లక్షల 29 వేల 913 పింఛన్లకు రూ.98. 20 కోట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. మొదటి రోజే మొత్తం పంపిణీ చేస్తారని, ఎక్కడన్నా వివిధ కారణాలతో అందుబాటులో లేకపోతే వారికి కూడా 3వ తేదీలోగా అందచేస్తామన్నారు. లబ్ధిదారుల ఇంటి నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పంపిణీ చేయాల్సి వస్తే కారణాన్ని ఎన్టీఆర్ భరోసా యాప్‌లో నమోదు చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

కానూరు కష్టాలకు చెక్!

- మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం
- ఏలూరు రోడ్డు నుంచి పీవీఆర్ ఐకాన్ వరకు రెండు వరసలుగా విస్తరణ
- రూ. 3.54 కోట్ల వ్యయంతో పనులు చేపట్టిన సీఆర్‌డీఏ
- సెంట్రల్ డివైడర్‌తో కూడిన రెండు వరసల రోడ్డుగా అభివృద్ధి
- ఆటోనగర్, కానూరు, తాడిగడప, ఎనికేపాడు, ప్రసాదంపాడు ప్రజలకు ప్రత్యామ్నాయం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: శక్తి కల్యాణమండపం రోడ్డు (కానూరు మెయిన్ రోడ్డు) విస్తరణ పనులను సీఆర్‌డీఏ అధికారులు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సింగిల్ లేన్‌గా ఉన్న రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరిస్తున్నారు. శక్తి కల్యాణమండపం నుంచి పీవీఆర్ ఐకాన్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ. 3.54 కోట్ల వ్యయంతో రోడ్డును విస్తరిస్తున్నారు. రెండో లేన్ కోసం ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. విజయవాడ - ఏలూరు రోడ్డు ప్రారంభంలో రెండో లేన్ పనులు చేసే దగ్గర కల్వర్టు నిర్మాణం కూడా పూర్తి చేశారు. వెట్‌మిక్స్, హాట్‌మిక్స్ పనులు చేపడుతున్నారు. త్వరలో సెంట్రల్ డివైడర్ పనులు చేపట్టనున్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కు అనుసంధానంగా శ్రీ శక్తి కళ్యాణమండపం నుంచి కానూరు మెయిన్ రోడ్డు ముందుకు సాగుతూ కామయ్యతోపు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65)ని తాకుతుంది. విజయవాడలో అంతర్గత ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కానూరు మెయిన్ రోడ్డు దోహదపడుతుంది. ఎనికేపాడు - తాడిగడప కానూరు 100 అడుగుల రోడ్డుకు దిగువన కానూరు మెయిన్ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ ద్వారా ఎనికేపాడు, ప్రసాదంపాడు ప్రాంతాల ప్రజలకు, తాడిగడప, కానూరు, అశోకనగర్, ఆటోనగర్ ప్రాంతాలకు విజయవాడను నేరుగా టచ్ చేయకుండానే బయట నుంచి బయటకు రాకపోకలు సాగించవచ్చు. ఒకరకంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65ను అనుసంధానిస్తుంది కాబట్టి తేలికపాటి వాహనాలకు చక్కటి ప్రత్యామ్నాయంగా ఉంటుంది.



దుర్గగుడి బస్‌రూట్ల వివరాలతో బోర్డుల ఏర్పాటు

ఇంద్రకీలాద్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో దుర్గమ దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దేవస్థానం బస్‌లో కొండపైకి వెళ్లేందుకు బస్ రూట్లు వివరాల బోర్డులను ఏర్పాటు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్, పండిట్ నెహ్రూ బస్టేషన్, దుర్గాఘాట్, కొండపైన తదితర ప్రాంతాల్లో ఈ బోర్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

గుడివాడ
● గుడివాడ ● పామర్రు

గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



గుడ్లవల్లేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం బాలికలకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పని విధానం, కమ్యూనికేషన్ సిస్టమ్, మహిళా సహాయక డెస్క్, రికార్డులు, 112, 1930, స్త్రీ శక్తి టీమ్స్ సేవలను గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ వివరించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పెదపాలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల 1987 బ్యాచ్

పెదపాలపర్రు అభివృద్ధిలో భాగస్వాములవుతాం

గుడివాడ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధికి అండదండలు అందిస్తామని పెదపాలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పెదపాలపర్రు గ్రామంలోని ఈదర శోభనాద్రి చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం సందడిగా జరిగింది. ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల బాగోగులు చర్చించారు. తమ వంతుగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్ణయించారు. రక్షిత మంచి నీటి సరఫరా పథకం సక్రమంగా పని చేయకపోవటం, బస్సు షెల్టర్ పునర్ నిర్మాణం, జాతీయ రహదారి వెంబడి మొక్కలు పెంచటం, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం వంటివి చర్చకు వచ్చాయి. పూర్వ విద్యార్థి బొప్పన నాగభూషణం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘంతో కలసి పని చేయటానికి తమ ఆధ్వర్యంలోని బొప్పన బాబురావు ట్రస్ట్ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే విషయంలో ఈదర సీతారామయ్య చొరవ తీసుకోవాలని కోరారు. సీతారామయ్య ఇప్పటికే గ్రామంలో పలువురు నిరుపేద విద్యార్థులకు ఫీజులు చెల్లింపు, పుస్తకాల పంపిణీ వంటివి చేపడుతుండగా, సమావేశం అభినందనలు తెలిపింది. విదేశాల్లో స్థిరపడిన నెక్కంటి వెంకట చౌదరి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ప్రయాణం శ్రేయస్కరం కాదని, అయితే పూర్తి స్థాయి డాక్యుమెంటేషన్‌తో వచ్చే వారికి ఇబ్బందులు లేవని వివరించారు. ఈ కార్యక్రమంలో బొప్పన శ్రీనివాస్, రామ్ మోహన్, వేణు గోపాల్, నాగేంద్ర బాబు, సంకురాత్రి శ్రీను, జగన్నాథం, బొప్ప రవికుమార్, ఉమ, ఉష, నాగలక్ష్మి, లక్ష్మీ, రాణి, రమ, శ్రీదేవి, పద్మ, రంగనాయకమ్మ, లక్ష్మీకుమారి, సుశీల పాల్గొన్నారు.




ఏఎన్ఆర్ కళాశాల గేటులో తనిఖీలు, పరీక్ష రాస్తున్న మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులు



మొవ్వ కళాశాల వద్ద నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

తొలిరోజు ఇంటర్ పరీక్షల కోలాహలం

గుడివాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : డివిజన్‌లో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల కోలాహలం నెలకొంది. గుడివాడలో ఐదు పరీక్షా కేంద్రాల్లో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఉదయం 7గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద బారులు తీరారు. పరీక్ష హాల్‌లోకి ఎటువంటి ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఏఎన్ఆర్ కళాశాలలో 485 మంది, శ్రీచైతన్య కళాశాలలో 477 మంది, కేటీఆర్ మహిళ కళాశాలలో 416 మంది, ఆర్‌కె జూనియర్ కళాశాలలో 285 మంది, నారాయణ జూనియర్ కళాశాలలో 355 మంది ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు.

మొవ్వలో..

కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొవ్వ కేంద్రం లో 212 మంది విద్యార్థులకు గానూ 206 మంది హాజరుకాగా, ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సర్వారెడ్డి, సుబ్రహ్మణ్యం పరీక్ష తీరుతెన్నులు పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా డి.సుధాకర్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా గంగాధర్ వ్యవహరించారు.

పామర్రులో..

పామర్రు : నియోజకవర్గ కేంద్రం పామర్రులో శనివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పామర్రు జూనియర్ కళాశాల పరీక్షల నిర్వహణ అధికారి వేంకటేశ్వరరావు తెలిపారు. పామర్రు పట్టణంలోని జూనియర్ కళాశాలలో మొదటి ఏడాది మొత్తం 302 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 295 మంది హాజరయ్యారని, ఏడుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని చెప్పారు. నిమ్మకూరు ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో పరీక్షలకు మొత్తం 133 మందికి గాను 132 మంది హాజరైనట్లు, ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి, డీవో శాంభవి చెప్పారు. సంబంధిత పరీక్షా కేంద్రాల వద్ద, పోలీస్, వైద్య ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో ఉన్నారు.





తమ పంటల రవాణాకు బాట లేకుండా ఇనుప ఫెన్సింగ్ వేశాడని చూపుతున్న రైతులు, శ్రీనివాసరావు పొలం నుంచి గతంలో ఉన్న రహదారి ఇదే

మా పంటల రవాణాకు దారి చూపండి

● రహదారి మూసేసిన రైతు ● నష్టపోతున్నామని రొయ్యూరు రైతుల ఆవేదన

తోట్లవల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా తమ పంట పొలాలకు ఉన్న రహదారిని లుక్కా శ్రీనివాసరావు (ప్రభుత్వ ఉద్యోగి) లేకుండా చేశారని, ఫెన్సింగ్ వేసి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్ళకుండా అడ్డుకోవడంతో టికి వరికుప్పలు నూర్చలేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా రహదారి సమస్యను పరిష్కరించలేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని రొయ్యూరుకు చెందిన రైతులు మోర్ల సత్యనారాయణ, లుక్కా నాంచారయ్య, మోర్ల వెంకటేశ్వరరావు, లుక్కా వాల్మీకి శనివారం తమ రహదారి సమస్యను ఆంధ్రజ్యోతికి దృష్టికి తీసుకువచ్చారు. తమతో పాటు పామర్తి గాంధీ లుక్కా వెంకట రాంబాబు, మోర్ల రామారావు తదితరులకు పది ఎకరాల వ్యవసాయ భూములున్నాయని, ఈ భూములకు పూర్వం నుంచి తూర్పు వైపుగా లుక్కా శ్రీనివాసరావు పొలం మీదుగా పంటల రవాణాకు రహదారి ఉండేదని తెలిపారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు శ్రీనివాసరావు పొలం మీదుగా ఉన్న దారి నుండి తమ పొలాకు వచ్చేవని, దాంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తులను బయటకు తెచ్చుకునే వారమని చెప్పారు. గతేడాది నుంచి శ్రీనివాసరావు తమ భూముల్లోకి వెళ్లేందుకు దారిలేదని చెప్పి ఇనుప ఫెన్సింగ్ వేసి ఇబ్బంది పెడుతూ వస్తున్నాడన్నారు. ప్రస్తుతం తమ పొలాల్లో వరికుప్పలు నూర్చకుండా ఉన్నాయని, దారి సౌకర్యం లేక కుప్పలను అలాగే ఉంచాల్సి వచ్చిందన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని, అయినా తమకు దారి సమస్య తీర లేదని తెలిపారు. లోపల ఉన్న వ్యవసాయ భూములకు దారి చూపకుంటే పంట ఉత్పత్తులను ఎలా బయటకు తేగలమని, భవిష్యత్తులో ఎలా వ్యవసాయం చేయగలమని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు చర్యతో తాము ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నామని, అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకుని దారి చూపాలని వేడుకొంటున్నారు.

దారి హక్కు లేదు : శ్రీనివాసరావు

మోర్ల సత్యనారాయణ, లుక్కా నాంచారయ్య, మోర్ల వెంకటేశ్వరరావు, లుక్కా వాల్మీకి తదితరు పొలాలకు తన పొలం నుంచి దారి హక్కు లేదని లుక్కా శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. తనకు మూడు ఎకరాల పొలం ఉందని, తనకు దారి కోసమని ప్రైవేటు భూమి 7 సెంట్లు కొనుగోలు చేశానని, అందులో ఇతర రైతులకు దారి ఎలా ఇవ్వగలనన్నారు. గతంలో దారి ఉందని, ఇపుడు దారిగా తన భూమిని ఇవ్వలేనని, త్వరలో ఏడు సెంట్ల ప్లాట్‌లో ఇల్లు కూడా నిర్మించనున్నాని చెప్పారు. పంచాయతీ, జడ్పీ రోడ్లకు లింకుగా ఉండే నాలుగు మార్గాలు ఆ రైతులకు ఉన్నాయని, వాటిని విడిచి తన పొలం మీదుగానే దారి కావాలంటే తాను అంగీకరించనన్నారు. తాను ఏఎస్సైగా పనిచేస్తున్నానని, తనకు అన్నీ తెలుసన్నారు.

ఇరు పక్షాలతో చర్చించా : తహసీల్దార్

రైతుల రహదారి సమస్యపై రొయ్యూరు వెళ్లి ఇరుపక్షాలతో చర్చించానని, కాని పట్టా భూమి నుంచి రహదారి ఇచ్చేందుకు శ్రీనివాసరావు అంగీకరించటం లేదని తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. వరికుప్పలు నూర్చి ధాన్యాన్ని బయటకు తెచ్చే దారి చూపెడతానని రైతులకు చెప్పినా శ్రీనివాసరావు పొలం వైపు దారి కావాలని పట్టుబడుతున్నారని తహసీల్దార్ చెప్పారు.

కృషి, పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధ్యం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేస్తున్న డీఈవో రామారావు

కూచిపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కృషి, పట్టుదలతో విద్యనభ్యసించినట్లైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డీఈవో పి.వి.జె. రామారావు పేర్కొన్నారు. మొవ్వ జడ్పీ పాఠశాల 79వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న వసతులు సద్వినియోగపర్చుకుని విద్యార్థులు లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలన్నారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు సంపాదించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు మండవ నీలవేణి వార్షికోత్సవం నిమిత్తం రూ.50 వేల ఫిక్సిడ్ డిపాజిట్ చెక్కును డీఈవో చేతులమీదుగా అందజేశారు. డీప్యూటీ ఈవో పద్మారాణి, ఎంఈవోలు శివశంకర్, శ్రీలక్ష్మీ, దాత ఎం.శేషగిరిరావు, ఇంచార్జ్ హెచ్ఎం ఎస్.శ్రీదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గురువిందపల్లి బాబురావు, వైస్ చైర్మన్ నాగలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

గుడివాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ లోపు ముగియనున్నందున పురపాలక సంఘానికి చెల్లిం చాల్సిన ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, కుళాయి పన్నులను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం, ఇతర శెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘ కార్యాలయం లో పన్నుల వసూలు కౌంటర్‌లు తెరిచే ఉంటా యన్నారు. పన్నులు తక్షణం చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

నేత్ర పరీక్షలు

పమిడిముక్కల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చోరగూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 300 మంది విద్యార్థులకు హ్యూమన్‌రైట్స్ అధినేత అమ్మిరెడ్డి రజనీ ఆధ్వర్యంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాల నేత్ర వైద్యనిపుణుడు డాక్టర్ భానుమూర్తి నేత్రవైద్యపరీక్షలు నిర్వహించారు.35 మంది విద్యార్థులకు కళ్ల జోళ్ల అవసరమని నిర్ధారించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు, మోడ్రన్ ఐట్రస్ట్ సభ్యులు పాల్గొని సేవలందించారు.

గోనె సంచుల చోరీపై ఆరా

తోట్లవల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రం గోడౌన్‌లో గోనెసంచుల చోరీ సంఘటనపై వ్యవసాయ శాఖ ఏడీఏ స్వర్ణలత శనివారం ఆరా తీశారు. తోట్లవల్లూరు వచ్చి వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావుతో కలిసి గోడౌన్‌ను పరిశీలించారు. 47 గోనె సంచులు చోరీ అయ్యాయని ఏవో వివరించారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్వర్ణలత సూచించారు.

మెగా జాబ్‌మేళా 5న

గుడివాడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : అక్కినేనినాగేశ్వరరావు కళాశాలలో దివీస్ లాబొరేటరీస్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులను ట్రైనీ హెల్పర్లుగా, బీఎస్సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, బీటెక్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఎం.ఫార్మసీ, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ, ఎనాలిసిస్/క్యూఏ/ఆర్‌ఎలకు గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌గా ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు.ఆఖరి సెమిస్టర్‌లో సబ్జెక్టులు పాస్‌కాని వారు సైతం పాల్గొనవచ్చన్నారు.

డాక్టర్ సీఎల్ వెంకట్రావు ఉచిత వైద్యసేవలు

గుడ్లవల్లేరు, మారి 1 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని డాక్టర్ సీఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్‌లో శనివారం ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సీఎల్ వెంకట్రావు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యపరీక్షలు చేయగా, విజయవాడ పీవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు గుండె సంబంధిత వ్యాధులకు ఈసీజీ, బీపీ పరీక్షలు, నేత్రపరీక్షలు, ఏలూరు డెంటల్ కాలేజి వైద్యులు దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు 300 మంది రోగులకు పరీక్షలు జరిపారు. ఆదివారం విజయవాడ కామినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

పెదపారుపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు (వంశీ) అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లను సమీక్షించి, వసూళ్లు వేగవంతం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యదర్శులు సాగర్ రాణి, డీసీహెచ్.శ్రీనివాసరావు, దయామణి తదితరులు పాల్గొన్నారు.

విదార్థి దశలోనే సమాజ సేవ

గుడివాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు సమాజ సేవను విద్యార్థి దశలోనే అలవాటు చేయాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) అన్నారు. ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీటీఎండీపీ జిల్లా మేనేజర్ జంపన భానుకిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్ణ శ్రీనివాస్, టీచర్లు ఝాన్సీలక్ష్మీ, రామలక్ష్మీ పాల్గొన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ

గుడివాడ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పింఛన్ల పంపిణీ 97 శాతం జరిగిందని ఎంపీడీవో టీవై విష్ణుప్రసాద్ అన్నారు. మల్లాయిపాలెంలో శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి మధ్యాహ్నానికే 97 శాతం పింఛన్లను పంపిణీ చేయటం జరిగిందన్నారు. సిబ్బందిని ఆయన అభినందించారు.

పెద ఎరుకపాడు పాఠశాలలో సైన్స్ ఫెయిర్



గుడివాడ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అద్భుతమైన సైన్స్ పరికరాలు తయారు చేశారని ఎంఈవో బాలాజీ తెలిపారు. పెద్ద ఎరుకపాడులోని పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను ఆయన తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలు తక్కువ ఖర్చుతో మంచి ప్రమాణాలతో వస్తువులు తయారు చేశారని అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.485

చంద్రయాన్ డైరెక్టర్ శ్రీకాంత్‌కు ఘనసత్కారం



మచిలీపట్నం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్ మోటమర్రి శ్రీకాంత్ సేవలు గర్వకారణమని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. లక్ష్మీనృసింహ సోమయాజి వైశ్య సమాజం, కన్యకా పరమేశ్వరీ దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించారు. సమాజం అధ్యక్షుడు తాడేపల్లి మెహర్‌బాబా, కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్, కాంతారావు, బైసాని హయగ్రీవరావు, ఉడత్తు శ్రీనివాసరావు, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.



పద్మావతి కళాశాల వద్ద కుమార్తెకు ధైర్యం చెప్పి పరీక్షకు పంపుతున్న తల్లి



స్టార్ కళాశాల పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరిన విద్యార్థులు



హిందూ కళాశాల వద్ద నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



బెస్టాఫ్ లక్..

తొలిరోజు ఇంటర్ పరీక్షల కోలాహలం

మచిలీపట్నం టౌన్ , మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షల కోలాహలం నెలకొంది. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యం చెపుతూ, విషెస్ చెపుతూ తమ పిల్లలను పరీక్షా కేంద్రాల్లో పంపారు. పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని బందరు డీఎస్పీ రాజా, జిల్లా ఇంటర్ అధికారి సాల్మన్‌రాజు సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మచి లీపట్నంలో పది పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. **పెడన :** బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 205 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావలసి ఉండగా 199 మంది హాజరయ్యారు. ఆరుగురు పరీక్షకు గైర్హాజర య్యారు. విజయానంద జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 135 మందికి 127 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. **చల్లపల్లి :** . చల్లపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా, మొత్తం 704 మంది విద్యార్థులకు 683 పరీక్షలకు హాజరయ్యారు. విజయ జూనియర్ కళాశాలలో 342 మందికి గాను 13 మంది గైర్హాజరు కాగా, విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో 362 మందికి గాను 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న తల్లిదండ్రులు



చల్లపల్లి ఇంటర్ కేంద్రంలో పరీక్ష గదుల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు



షేక్ ఆలీ మాస్టర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు

షేక్ ఆలీ మాస్టర్ సేవలు నిరపమానం

గూడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో షేక్ ఆలీ మాస్టర్ చేసిన కృషి మరువలేనిదని వక్తలు పేర్కొన్నారు. గూడూరు ఉర్దూ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన షేక్ ఆలీ మాస్టర్ పదవీ విరమణ అభినందన సభ శనివారం జరిగింది. దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. గూడూరు సర్పంచ్ లింగం సులోచనారాణి, విజయకుమార్, పెడన మునిసిపల్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఎండీ ఖాజా, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎస్‌ఏ బేగ్, ఎండి సాహెబ్ (దాదా), ఎంఈవో-2 పి. సుబ్రహ్మణ్యం, ఉర్దూ డీఐ ఎండి సదాతుల్లా, యుటీఎఫ్ నాయకులు కె. ఉమామహేశ్వరరావు, ఎల్. వెంకటేశ్వరరావు, షౌకత్ అలీ, ఎంఎస్ సిరాజ్, జైగమ్ అబ్బాస్, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

మోపిదేవి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ సంక్షేమం, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్, అవనిగడ్డ డివిజన్ సహాయ కార్యదర్శి దివ్య తదితరు లు ఆయన వెంట ఉన్నారు.



దుర్గానాగేశ్వరునికి శమీ వృక్ష పూజ



మోపిదేవి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శమీవృక్ష పూజ వైభవంగా నిర్వహించారు. స్వా మి, అమ్మవార్లను రాజాధిరాజంపై ఊరేగింపుగా దేవస్థానం నుంచి గ్రామశివారులోని శమీవృక్షం వద్దకు శాస్త్రోక్తంగా తీసుకుని వెళ్లారు. ప్రధాన అర్చకులు బుద్దు నాగ వరప్రసాద్ ఆధ్వర్యం లో అర్చక బృందం వేద మంత్రోచ్ఛరణ మధ్య శమీపూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ స్వామివారి ప్రసాదాలు భక్తులకు అందజేశారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవాలు 4 నుంచి

అవనిగడ్డ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు గ్రామస్థుల ఆర్థిక సహకారంతో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మార్చి 4వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయని ఆల య అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 4వ తేదీన యాగశాల ప్రవే శం, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తుహోమం జరుగుతాయని, 5వ తేదీన అగ్ని ప్రతిష్ఠ, హోమ క్రతువులు, క్షీరాధివాసం, జలాధివాసం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 6వ తేదీ ఉదయం గం.11.45లకు విగ్రహ ప్రతిష్ఠ అనంవతరం భారీ అన్నసమారాధన జరుగుతాయన్నారు. వాస్తు సిద్దాంతి పాకలపాటి రామచంద్రరావు పర్యవేక్షణలో దీవి వెంకట ఫణి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు.



అద్దంకి నాంచారమ్మ గ్రామసంచారం

చల్లపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పెదప్రోలులో శ్రీఅద్దంకి నాంచారమ్మ తల్లి అమ్మవారి జాతర ఈనెల 14వ తేదీన జరుగనున్న నేపథ్యంలో శనివారం చల్లపల్లిలో అమ్మవారి గ్రామసంచారం జరిగింది. ఆలయ కమిటీ పెద్దల పర్యవేక్షణలో అమ్మవారు గ్రామంలో సంచరించగా, భక్తులు వారుపోసి అమ్మవారికి పసుపు కుంకుమలు టెంకాయలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల హోరులో అమ్మవారి గ్రామసంచారం కొనసాగింది.

మోపిదేవి ఆలయంలో చలువ పందిరి ఏర్పాటు

మోపిదేవి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థంనిమిత్తం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని నిత్యాన్నదాన సత్రానికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో భక్తులు సేదతీరేందుకు తాటాకు పందిరి వేస్తున్నారు



పోలీస్‌సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పరమేశ్వర్

ఇనకుదురు పోలీస్‌స్టేషన్లో ఓపెన్ హౌస్

మచిలీపట్నం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దిశ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసు స్టేషన్లలో శనివారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇనకుదురు పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు రిసెప్షన్, ఉమెన్ హెల్ప్‌డెస్క్, మహిళల భద్రత, పోక్సో చట్టం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌ను ఎదుర్కొనే అంశాలను వివరించారు. ఇనకుదురు సీఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

ఘంటసాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు చేస్తున్న కూలీలు తడి, పొడి చెత్తను ఇళ్ల వద్ద వేర్వేరుగా అందించాలని పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. సంపద సృష్టి కేంద్రం వద్ద ఉపాధి హామీ పథకం కూలీలకు షెడ్డులో తడి, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేశారో తెలియజేశారు. తడి, పొడి చెత్తను గ్రామస్థులు అందించటం వల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి సహకరించాలని కోరారు. కరపత్రాలను అందజేశారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

అవనిగడ్డ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలు సేకరించే తడి, పొడి చెత్తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని ఈవోపీఆర్డీ అరుణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం అవనిగడ్డ పంచాయతీ పరిధిలో తడి, పొడి చెత్తను వేరు చేసి పొడి చెత్తను విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ కార్యదర్శి పి.అనిత ద్వారా పంచాయతీకి జమ చేశారు. ఈవోపీఆర్డీ అరుణ మాట్లాడుతూ పంచాయతీలు నిర్వహించే సంపద సృష్టి కేంద్రాలు పంచాయతీల ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడాలని సూచించారు.

మామిడిలో సమగ్ర సస్యరక్షణ అవసరం

అవనిగడ్డ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయ కర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మామిడిలో చీడపీడల యాజమాన్యం గురించి శనివారం అవనిగడ్డలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూత దశలో ఉన్న మామిడిలో తేనెమంచు, తామర పురుగు, ఎండు పురుగు పంటను నష్టపరుస్తున్నాయన్నారు. వీటి నివారణకు ఎమిడాక్లోపిడ్ 0.3 మిల్లీమీటర్లు లేదా డయోమిథాక్లిమ్ 0.3 గ్రాములు లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలని ఆమె సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త మంజువాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, వీఏఏ తనూష తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతకు సహకరించాలి

కోడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలకు గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వ్యాపారస్థులకు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తడి, పొడి చెత్తను సంపద సృష్టి కేంద్రాల్లో ఉంచి వర్మీకంపోస్టు తయారీకి చర్యలు చేపడుతున్నామన్నారు.



బెరాకా సేవలు మరువలేనివి

మచిలీపట్నం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు బెరాకా మినిస్ట్రీస్ చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మచిలీపట్నం అసెం బ్లీ నియోజకవర్గ కార్యాలయంలో బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 27 మంది పేద విద్యార్థులకు రూ.7.09 లక్షల చెక్కులను అందజేశారు. పి.వి. ఫణికుమార్, లోగిశెట్టి వెంకటస్వామి, డేవిడ్‌రాజు, తుమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మచిలీపట్నం టిబి నివారణ సూపర్‌వైజర్ ఏ. విజయగౌరి అన్నారు. హైనీ హైస్కూల్‌లో శనివారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ సోకిన వారికి ఆరునెలల పాటు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ. 1000 ప్రభుత్వం అందిస్తుందన్నారు. హైనీ హైస్కూల్ హెచ్‌ఎం రాహుల్, కె.వి. ప్రసాద్, డా. వెంకట్రావు తదితరులు మాట్లాడారు.

ఆండ్రాయిడ్ అప్లికేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆండ్రాయిడ్ అప్లికేషన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని వీక్ష టెక్ సొల్యూషన్స్ అధినేత ఎస్.వి. కృష్ణ అన్నారు. ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టీ. రవికుమార్ అధ్యక్షత వహించిన వైస్‌ప్రిన్సిపాల్ బి. నాగజ్యోతి, కంప్యూటర్ సైన్స్ హెచ్‌ఓడి ఎస్. సుష్మ, అబ్దుల్ నబి తదితరులు పాల్గొన్నారు.



కాల్వల పూడికతీత పరిశీలన

కోడూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు ఉదాహరణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కాల్వలు, డ్రైనేజీలు అభివృద్ధి చేయటమే నిదర్శనమని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు అన్నారు. మందపాకల మెయిన్ చానల్, ఒకటో, ఐదో చానల్ కింద జరుగుతున్న పనులను ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, జేఈ రవికుమార్‌లతో కలసి పరిశీలించారు. అప్పికట్ల రవీంద్రబాబు, బావిశెట్టి సురేష్, మహమ్మద్ ఇమ్రాన్, లస్కర్ సయ్యద్ నజీర్, రైతులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం : కట్టా

పెడన, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు ఆవేదన వ్యక్తం చేశారు. యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, రిబే టు, పావలా వడ్డీ, ఇన్‌సెంటివ్, సహకార సంఘాలకు రావలసిన బకాయిల ఊసే బడ్జెట్‌లో లేదని ఆయన విమర్శించారు.



క్రీడా సామగ్రి వితరణ

చల్లపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం 1984-85 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులు రూ.12వేల విలువైన క్రీడాసామగ్రిని హెచ్‌ఎం ఎస్.సుదర్శన ధర ప్రసాద్, పీఈటీ జి.శ్రీనివాస్‌లకు శనివారం అందజేశారు. పూర్వవిద్యార్థులు కొల్లిపర నరేంద్ర, కంతేటి చంద్రశేఖర్, ఉడత్తు వెంకటేశ్వరరావు, వెంట్రప్రగడ రమేష్, రావులపల్లి విఘ్నేశ్వరరావు, షేక్ నబీషహీరి, ఉపాధ్యాయులు రాజు, రేణుప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.